క్లుప్తంగా

వైభవంగా హోమం

చిల్లకూరు/గూడూరు రూరల్ : గూడూరులోని విజయదుర్గ అమ్మవారి ఉపపీఠంలో గురువారం మహాలక్ష్మి సర్వ సౌభాగ్య సిద్ధి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారి జయంతి పౌర్ణమి తిథిని పురస్కరించుకుని 108 పర్యాయాలు శ్రీ సూక్త పారాయణ సహిత మూల మంత్ర హోమం చేపట్టారు. నిర్వాహకులు కోటా సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తులు

చిల్లకూరు : 2025–26 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు పాలిసెట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చేయవచ్చని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కే రవిక్రిష్ణ తెలిపారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న వారు, గతంలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని వెల్లడించారు. గూడూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే నెల 4 నుంచి ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి..

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25లో ఇంటర్ లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తులసిజ్యోతి తెలిపారు. ఈనెల 17 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. పదో తరగతిలో వచ్చిన గ్రేడ్లను బట్టి ఎంపిక ఉంటుందని వివరించారు.

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్ గుర్తింపు

చిల్లకూరు : పింక్ బస్సులో స్క్రీనింగ్ పరీక్షలు చేసుకుంటే క్యాన్సర్ వ్యాధిని గుర్తించవచ్చని చిల్లకూరు పీహెచ్‌సీ వైద్యులు అరాఫత్ తెలిపారు. చిల్లకూరు పీహెచ్‌సీ పరిధిలోని ముత్యాలపాడు, కడివేడు గ్రామాల్లో గురువారం పింక్ బస్సు ద్వారా మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. స్విమ్స్ వైద్యాధికారులు చైతన్యభాను, పద్మావతి మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన మహిళలు తప్పనిసరిగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సర్పంచులు వెంకటమ్మ, హరిత, పంచాయతీ కార్యదర్శులు ఆలీబాషా, రమాదేవి, సూపర్‌వైజర్లు రవి, మునిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు జీవిత, ప్రత్యూష, ఏఎన్‌ఎంలు వెంకటరత్నమ్మ, శాంతికుమారి పాల్గొన్నారు.

పశువులకు చికిత్స

చిల్లకూరు : రైతులు వేసవిలో పశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలని క్రిష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లోని పశు వైద్యాధికారులు తెలిపారు. వారు గురువారం లింగవరం, పల్లివానిదిబ్బలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ హరీష్ మాట్లాడుతూ పశువులను వేసవిలో ఎక్కువ సేపు మేతకు తిప్పకూడదన్నారు. అదానీ క్రిష్ణపట్నం పోర్టు ప్రతినిధులు పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ నాశిన సుబ్రహ్మణ్యం, సీహెచ్ వెంకటేశ్వర్లు, బీ ప్రసన్నకుమార్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

చిల్లకూరు : ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని ఏపీడీ వరప్రసాద్‌రావు ఆదేశించారు. ఆయన గురువారం పారిచెర్లవారిపాళెంలో ఉపాధి కింద చేపట్టిన ఫారం పాండ్ పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఫారం పాండ్ల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. నీరు నిల్వ ఉండి పశువులు తాగడానికి, పంటల సాగుకు ఉపయోగించుకోవచ్చన్నారు. అనంతరం తిప్పగుంటపాళెంలో సోఫ్ పిట్లను పరిశీలించారు. ఏపీవో గిరిబాబు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

గూడూరు రూరల్ : మండలంలోని కొండాగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు గురువారం రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ప్రతినిధులు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలమని, బాగా చదివి మంచి మార్కులు సాధించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చోళవరం గిరిబాబు, పామంజి నాగరాజారెడ్డి, స్వర్ణా రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్ : ఎన్ఎస్ఆర్ కాలనీ సమీపంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఎన్ఎస్ఆర్ కాలనీకి చెందిన ఎస్.వెంకటయ్య(45) ఇంటికి నడిచి వెళుతున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని వైద్యశాలకు తరలించారు. అక్కడ అతను మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్సును ఢీకొన్న కారు

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి–నాయుడుపేట రోడ్డులోని ఏపీ మోడల్ స్కూల్ వద్ద గురువారం కారు అదుపుతప్పి ప్రైవేటు కంపెనీకి చెందిన బస్సును ఢీకొంది. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట సెజ్‌లోని ఓ పరిశ్రమకు చెందిన బస్సు సిబ్బందిని ఎక్కించుకుని బయలుదేరింది. ఏపీ మోడల్ స్కూల్ వద్ద అటువైపు వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కారు, బస్సు ముందు భాగాలు దెబ్బతిన్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

సైదాపురం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ హెచ్చరించారు. ఆయన గురువారం చాగణం, సైదాపురం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలపై ఆరా తీశారు. ప్రజలకు సత్వరమే సేవలు అందించాలని ఆదేశించారు.

కాళంగి నదిలో లీక్ అవుతున్న లాక్‌లు

దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల రైతుల వర ప్రసాదిని అయిన కాళంగి నదిపైనున్న ఆనకట్టను ఆనుకుని నిర్మించిన లాక్‌లు దెబ్బతిన్నాయి. నీరు వృథాగా పోతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున నీరు వచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. లాక్‌లను సరిచేసి నీటి వృథాను అరికట్టాలని అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే నెర్రికాలువ మొత్తం చెట్లు, ముళ్లపొదలతో పూడుకుపోయింది. ప్రభుత్వం స్పందించి లాక్‌లను సరిచేయాలని, నెర్రికాలువను బాగు చేయాలని కోరుతున్నారు.

- వృథాగా పోతున్న నీరు
- నెర్రికాలువలో పిచ్చిమొక్కలు
- పట్టించుకోని అధికారులు



కమ్మకండ్రిగ వద్ద కాళంగి నదిపై నిర్మించిన లాక్‌కు లీక్ అవుతున్న దృశ్యాలు

దొరవారిసత్రం : మండలంలోని తనియాలి పంచాయితీ కమ్మకండ్రిగ సమీపంలో కాళంగి నదిపై బ్రిటీష్ హయాంలో ఆనకట్ట నిర్మించారు. దాన్ని ఆనుకునే ఐదు లాక్‌లను 25 ఏళ్ల కిందట ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. అవి ప్రస్తుతం మరమ్మతులకు గురయ్యాయి. నీరు వృథాగా పోతోంది. అధికారులు లాక్‌లను, ఆనకట్టను చూసి వెళ్లడం తప్ప మరమ్మతులు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆనకట్ట నిండింది. లాక్‌ల నుంచి నీరు వృథాగా సముద్రంలో కలిసిపోయిందని చెబుతున్నారు. ఆనకట్టలో నీరు ఉంటే కమ్మకండ్రిగ, కొత్తకండ్రిగ, తనియాలి, వెదురుపట్టు, కుప్పారెడ్డిపాళెం తదితర ప్రాంతా ల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదు. రైతులు మోటార్లతో నీటిని తోడుకుని పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. కాళంగి నదిపై వున్న ఆనకట్ట ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు వేల ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయి.



అధ్వాన స్థితిలో వున్న లాక్‌లు



చెట్లు, ముళ్ల పొదలతో నిండిన నెర్రికాలువ

పూడిపోయిన నెర్రికాలువ

(కాళంగి నది నుంచి ప్రారంభమయ్యే నెర్రికాలువ దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లో 27 కిలోమీటర్లు విస్తరించి ఉంది. దీనిద్వారా పలు చెరువులకు నీరు చేరుతుంది. నమ్ముకుని మావిళ్లపాడు, మినమలముడి, చందనముడి, పిండిపాకెం, టపాయిండ్లు, తల్లంపాడు తదితర గ్రామాల్లో 2 వేల ఎకరాలపైగా పంటలు సాగవుతాయి. ప్రజలకు తాగునీటి సమస్య ఉండదు. కాలువ మొత్తం చెట్లు, ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీన్ని బాగు చేయాలని పలుమార్లు కోరినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

మరమ్మతులు చేయడం లేదు



ఆనకట్టను, లాక్‌లను ఇరిగేషన్ అధికారులు చూసి వెళ్లడం తప్ప మరమ్మతులు చేపట్టడంలేదు. లాక్‌లను మరమ్మతులు చేసి ఉంటే వర్షపు నీరు ఆనకట్టలో ఉండేది. అదనంగా వచ్చిన నీరు నెర్రికాలువ ద్వారా వివిధ ప్రాంతాల్లోని చెరువుల్లోకి చేరేది. రైతులకు సాగు నీటి కష్టాలు తీరేవి. నీరు వృథాగా పోయింది.

– డి.వెంకటసుబ్బయ్య, కమ్మకండ్రిగ గ్రామం

పిచ్చిమొక్కలతో నిండిపోయింది



ఈ ప్రాంత రైతులకు వరప్రసాదిని అయిన నెర్రికాలువ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. కాలువ స్వరూపం కోల్పోయి దారుణంగా దర్శనమిస్తోంది. కాళంగి నదిలో నెర్రికాలువ పుట్టే ప్రాంతంలో పూడికతీత పనులు చేపట్టాలని పలుమార్లు అధికారులను కోరాం. నెర్రికాలువను బాగు చేస్తే చెరువుల్లోకి నీరు వస్తుంది.

– కె.కిష్టయ్య, మావిళ్లపాడు

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

తడ: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 63 యూనిట్లు మంజూరయ్యాయి. 273 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హత ఉన్న వారిని గుర్తించి రుణాలు మంజూరు చేస్తామని బ్యాంక్ అధికారులు తెలిపారు. కూటమి నేతల నుంచి ఇప్పటికే జాబితా వచ్చిందని, వారికే రుణాలు ఇవ్వనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ రమణయ్యకు పరామర్శ



నివాళులర్పిస్తున్న సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి

చిట్టమూరు : వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, వైస్ ఎంపీపీ బీవీ రమణయ్యను గురువారం ఆ పార్టీ మండల కన్వీనర్ సన్నా రెడ్డి శ్రీనివాసులు రెడ్డి పరామర్శించారు. బీవీ రమణయ్య సోదరుడు శివప్రసాద్‌రావు గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన చిట్టమూరు చేరుకున్నారు. శివప్రసాద్‌రావు మృతదేహంపై పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మాచిరెడ్డి సుధీర్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు దువ్వూరు లోకేష్ రెడ్డి, ఆశ మధు, వైసీ పుట్టబాబు, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గూడూరు విద్యార్థిని

గూడూరు రూరల్ : గూడూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని దీపిక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మాధవిలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కావలిలో సబ్ జూనియర్స్ బాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఇందులో తమ విద్యార్థిని దీపిక 55 కేజీల విభాగంలో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైందన్నారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందులలో జరగనున్న 34వ సబ్ జూనియర్స్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో బాలిక పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినితోపాటు పీడీ విజయలక్ష్మి, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ తరఫున సహకారం అందించిన లతను అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన దీపికను అభినందిస్తున్న హెచ్ఎం మాధవి లక్ష్మి

ఉపాధ్యాయులకు సత్కారం



డాక్టరేట్ అందుకున్న షేక్ జిలానీ బాషాను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ వారు

చిట్టమూరు : ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న మండలంలోని మెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, సంతోష్ కుమార్, శ్రీనివాసులు, బాలచంద్రను గురువారం నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అలాగే ఇటీవల ఢిల్లీలో డాక్టరేట్ అందుకున్న మెట్టు గ్రామానికి చెందిన షేక్ జిలానీ బాషాను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పచ్చలపల్లి నరేష్ రెడ్డి, ఎంఈవో బీవీ కృష్ణయ్య, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జయరాజ్ గోపాల్, కార్యదర్శి రామ్మోహన్, హెచ్ఎం పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

సూళ్లూరుపేట : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూళ్లూరుపేటలోని శ్రీ రామలింగ చాముండేశ్వరిదేవి మహిళా సేవా సమితి ప్రతినిధులు కోరారు. వారు గురువారం సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న దేవాంగ మహిళలను సత్కరించారు. ఉత్తమ మహిళా సేవకురాలు సర్టిఫికెట్ అందజేశారు. అలాగే పట్టణంలో పని చేస్తున్న నాగూరమ్మ అనే హోంగార్డును సన్మానించారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో బుద్ధి విజయలక్ష్మి, లవిశెట్టి కృష్ణవేణి, పులి శైలజ, వెలుగోటి త్రివేణి, ఉమ్మిడి చంద్రలక్ష్మి, గుమ్మిడి శైలజ, గుమ్మడి గౌరి, గుమ్మడి శాలిని, మన్నెముద్దు నిర్మల తదితరులు పాల్గొన్నారు.



మహిళను సత్కరిస్తున్న రామలింగ చాముండేశ్వరి దేవి మహిళా సేవా సమితి ప్రతినిధులు

ల్యాబ్ టెక్నీషియన్ల సేవలు మరువలేనివి

గూడూరురూరల్ : గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన ల్యాబ్ టెక్నీషియన్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, ఆర్ఎంవో డాక్టర్ రవికుమార్, డాక్టర్లు రాజా, కమల్‌రాజా, సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, సభ్యులు కోట వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసులు, పెంచలయ్య, మల్లికార్జున్, మునిప్రసాద్, విజయ్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్ టెక్నీషియన్లను సన్మానిస్తున్న వైద్యులు, సంస్థ ప్రతినిధులు

ప్రజలకు సౌకర్యంగా రోడ్డు నిర్మాణం

చిల్లకూరు : ప్రజలకు ఇబ్బంది లేకుండా సాగరమాల, భారతమాల రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. సాగరమాల, భారతమాల రోడ్ల నిర్మాణంతో చిల్లకూరు, కోట మండలాల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తిరుపతి ఎంపీ గురుమూర్తి పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీంతో రోడ్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు, ఎంపీ కార్యాలయ సిబ్బంది గురువారం చిల్లకూరు, కోట మండలాల్లో పర్యటించారు. పారిచెర్లవారిపాళెం, చేడిమాల – తిప్పగుంటపాళెం, ఉడతావారిపాళ్లపల్లి వద్ద రాకపోకలకు ఇబ్బంది లేకుండా బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. అంకులపాటూరు రైతుల పంట పొలాల్లో నీరు సాఫీగా వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఆదిత్య, కే శ్రీనివాస్‌రావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యద్దల మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దువ్వూరు మధుసూదన్ రెడ్డి, ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు మాజీ అధ్యక్షుడు వరదిరెడ్డి రామోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బల్లవోలు రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కమ్ముకున్న పొగ మంచు



దొరవారిసత్రం : ఇటీవల వాతావరణంలో విచిత్రమైన మార్పులు వస్తున్నాయి. రాత్రి మంచు కురుస్తోంది. పగలు ఎండ విపరీతంగా కాస్తోంది. ఈ క్రమంలోనే దొరవారిసత్రం మండలంలో గురువారం తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కమ్ముకుంది. ఉదయం 7 గంటలైనా మంచు వీడలేదు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు లైట్లు వేసుకుని వాహనాలను నడపాల్సివచ్చింది.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

రాపూరు: మండలంలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో భవాని హౌసింగ్ ఏఈ రామకృష్ణను ఆదేశించారు. ఆమె గురువారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇస్తోందని తెలిపారు. అదనంగా ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు మంజూరు చేస్తోందని వివరించారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు వివరించి ఇళ్ల నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పని భారం తగ్గించాలని వినతి

తడ: ఇప్పటికే ఉన్న పనులతోపాటు సర్వేల పేరుతో తమపై పని ఒత్తిడి పెంచుతున్నారని, తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. వారు గురువారం ఎంపీడీవో విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సర్వేల వల్ల ఒత్తిడి ఎక్కువగా ఉందని, దీనికి సచివాలయం సిబ్బంది సహకారం అందించడం లేదన్నారు. తమకు మాతృసంస్థల్లో పని భారం ఉందని వారు తప్పించుకుంటున్నారని వాపోయారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

వెంకటగిరి రూరల్ : సేంద్రియ ఎరువులతో భూమి సారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని కేవీకే శాస్త్రవేత్త రాజీవన తెలిపారు. స్థానిక కేవీకేలో గురువారం పర్మినెంట్ సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పంటల్లో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. శాస్త్రవేత్త విజయశ్రీ, ప్లాంట్ ఇన్‌చార్జి మహేంద్ర, నాగూరుబాషా, శాస్త్రవేత్త నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం

రాపూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని రాపూరు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. రాపూరు ఆర్టీసీ డిపో నుంచి వెంకటగిరి, గూడూరు రోడ్లలో తిరిగే బస్సుల్లో ప్రయాణిస్తున్న వారిలో లక్కీ డిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి గురువారం బహుమతులు అందించారు. ఎస్‌టీఐ బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు


దొరవారిసత్రం : దొరవారిసత్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీపై ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, అంకమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతోపాటు విద్యను అందించాలన్నారు. బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు.

సముద్రుడి ఉగ్రరూపం

వాకాడు: వాకాడు మండలం, తూపిలిపాళెం సముద్ర తీరంలో గురువారం పౌర్ణమి రాకతో సముద్రంపై సాధారణ సమయాల్లో కన్నా ఇప్పుడు అలల తీవ్రత పెరిగింది. వారం రోజులుగా మత్స్యకారు లు వేట చేయలేకపోతున్నారు. ఎంత గాలించినా ఒక్క చేప కూడా దొరకడం లేదు. సముద్రంపై నీళ్లు పెరగడంతోపాటు సముద్ర తీరం ముందుకు జరిగింది. దీంతో మండలంలోని 14 మత్స్యకార గ్రామాలకు చెందిన మత్స్యకారులు వేట చేయలేక ఒడ్డున చేరారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నాయుడుపేట టౌన్ : పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నమేడు జెడ్పీ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ కన్వీనర్ చిగురువాడ పద్మనాభం కోరారు. పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తామని వెల్లడించారు. హెచ్ఎం ఎస్ మధుసూదన్ పాల్గొన్నారు.



ఓజిలి : విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న హెచ్ఎం వెంకటేశ్వర్లు

ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజ

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ చేశారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, మల్లికార్జున, నరసిహరాజు, సర్దార్‌బాషా, అంకయ్య, విజయ్‌మనోజ్, చంద్రబోస్, సుధారాణి పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: సైదాపురంలోని గోగినేని సుబ్బానాయుడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ చేశారు. హెచ్ఎం వాసుదేవకుమార్ విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు.

పంచాయతీ తీర్మానంతోనే ఉపాధి పనులు

పెళ్లకూరు: పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామసభలో తీర్మానం చేసిన పనులు మాత్రమే చేపట్టాలని సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి తెలిపారు. చిల్లకూరు సచివాలయంలో గురువారం పంచాయతీ పాలకవర్గం అత్యవసర సమావేశం నిర్వహించారు. పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసిన పనులను మాత్రమే ఉపాధిహామీ పథకం కింద చేపట్టాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కూటమి నాయకులు చేసే పనులకు నిధులు ఇవ్వకుండా కోర్టులో రిట్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి నాయకులకు అప్పగించిన సిమెంట్ రోడ్డు పనుల విషయమై తపాలా ద్వారా కోర్టు ఉత్తర్వులను ఎంపీడీవోకు అందజేసినట్లు చెప్పారు. ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, ఎంపీడీవో ప్రమీలారాణి పంచాయతీ చట్టాలను కాలరాస్తూ కూటమి నాయకులకు పనులు అప్పగించి ఉపాధి నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు తీరుపై కోర్టులో రిట్ వేస్తున్నట్లు వివరించారు. కూటమి నాయకులకు భయపడే చెరువు వేలంపాటను కూడా నిర్వహించలేదని విమర్శంచారు. పంచాయతీ కార్యదర్శి సూర్య, వార్డు సభ్యులు అంకయ్య, నాగార్జున, సుజాత, సురేష్, వాణి, అల్లెమ్మ పాల్గొన్నారు.



పంచాయతీ పాలకవర్గం అత్యవసర సమావేశం

తప్పు చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టం



బుజ్జిరెడ్డికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి

- నిబంధనల మేరకే పనిచేయండి
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హెచ్చరిక

సైదాపురం : అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయాలని, కూటమి నేతల మెప్పు కోసం తమ కార్యకర్తలను ఇబ్బందులు పెడితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హితవుపలికారు. ఆయన గురువారం తురిమెర్లలో ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కొంతమంది అధికారులు కూటమి నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2027లో జమిలి ఎన్నికలు రాబోతున్నాయని, వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. తప్పు చేసిన అధికారి ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే ఉండదన్నారు. బుధవారం జరిగిన యువత పోరు కార్యక్రమం విజయవంతం కావడంతో కూటమి నేతల్లో భయం పట్టుకుందన్నారు. అనంతరం వేటూరి బుజ్జిరెడ్డి ఉత్తర క్రియల్లో పాల్గొన్నారు. బుజ్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మన్నారపు రవి కుమార్‌యాదవ్, గుంటమడుగు శ్రీనివాసులురాజు, ఎన్ రాంగోపాల్‌రెడ్డి, కంభం విజయభాస్కర్‌రెడ్డి, బట్టేపాటి దయాకర్‌రెడ్డి, శివకుమార్, మోహన్‌రావు, యోగిరాజు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

పట్టాభిరామిరెడ్డికి పరామర్శ

రాపూరు: రాపూరు వైఎస్సార్‌సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డిని గురువారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. పట్టాభిరామిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుని రాపూరులోని స్వగృహానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వారు గురువారం అక్కడికి చేరుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అలాగే రామిరెడ్డిపల్లిలో ఇటీవల పెళ్లి చేసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మునిప్రకాష్, అనితను నేదురుమల్లి, మేరిగ మురళీధర్ ఆశీర్వదించారు. దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, బొద్దు మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ ఖాదర్‌బాషా, పాలంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని తానంచర్లలో వైఎస్సార్ సీపీ నాయకుడు వంకేవోలు కోటేశ్వరరెడ్డి అన్న తిరుపాల్‌రెడ్డి ఇటీవల మృతిచెందారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగమురళీధర్ గురువారం తానంచర్ల వెళ్లి తిరుపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. మునగాల వెంకటాపురం సర్పంచ్ మునగాల జగదీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి గూడూరులోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతన్ని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగమురళీధర్ పరామర్శించారు.



రామిరెడ్డి పల్లిలో నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లిరామ్ కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్



రాపూరులో బత్తిన పట్టాభిరామిరెడ్డిని పరామర్శిస్తున్న నేదురుమల్లిరామ్ కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్



జగదీష్‌ను పరామర్శిస్తున్న నేదురుమల్లిరామ్ కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్